మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్/నారాయణపేట





ఆసుపత్రిలో పేషంట్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

### ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన

# వైద్యమందించాలి

**నారాయణ పేట కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట,సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిరుపేద ప్రజలు వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నందున వారికి మెరుగైన సేవలు అందించేందుకు వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలు సిబ్బంది హాజరు రిజిస్టర్ మందుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఓపి జనరల్ వార్డులను సందర్శిం చి రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఆసుపత్రి ఆవరణ బెడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా వైద్యులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళల భద్రతకు

# షీటీమ్స్ అంకితం

**మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి**

**మహబూబ్‌నగర్‌బ్యూరో,సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** జిల్లాలో మహిళలు, బాలికలు,విద్యార్థినుల రక్షణకోసం షీటీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి తెలిపారు. రద్దీ ప్రదేశాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వపాఠశాలలు,కళాశాలలు, మోడల్‌స్కూళ్లు,రెసిడెన్షియల్ స్కూల్‌లలో సివిల్‌డ్రస్‌లో నిఘా నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.ఎవరికైనా వేధింపులు జరిగిన వెంటనే జిల్లా షీటీమ్ నెంబర్ 8712659365 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని, మహిళల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు. ఆగస్టు నెలలో మాత్రమే జిల్లాలో మొత్తం 25 ఫిర్యాదులు అందగా, అందులో 13 మందికి కౌన్సెలింగ్, 11 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం, 3 ఇవిటీజింగ్ కేసులు నమోదు చేయడం, అలాగే 25 అవగాహన కార్యక్రమాలు, 70 హాట్‌స్పాట్ విజిట్స్ నిర్వహించినట్లు తెలిపారు. పోకిరీలను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ చేయడం కూడా షీ టీమ్స్ ద్వారా జరుగుతోందన్నారు. విద్యార్థులకు ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో చట్టాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, బాల్య వివాహాల పరిణామాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వాడకం వల్ల కలిగే నష్టాలు, సైబర్ క్రైమ్స్, డయల్ 100 ప్రాముఖ్యత, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్ వంటి అంశాలపై షీటీమ్ సిబ్బంది ప్రతిరోజూ అవగాహన కల్పిస్తున్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

### ఫిర్యాదులను ఎప్పటికప్పుడు

# పరిష్కరించండి

**జిల్లా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి,సెప్టెంబరు1 ప్రభాతవార్త:** ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్,అదనపుకలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య,ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 36 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమస్య పరిష్కారంపై బాధితుడికి సూచనలు చేస్తున్న కలెక్టర్ సంతోష్

### ఫిర్యాదులు సత్వరం

# పరిష్కరించాలి

**గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్**

**గద్వాలటౌన్,సెప్టెంబర్1,ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి 46 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

## అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించరాదు

**జిల్లాలో 30 వరకు పోలీస్ యాక్ట్ అమలు .. మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి వెల్లడి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు సెప్టెంబర్ 30 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదు. నిషేధిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరానికి పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదని, ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను జనసమూహం కావడం వంటివి నిషేధమన్నారు. లౌడ్ స్పీకర్‌లు, డీజేలు వంటివి కూడా ఈ సమయంలో నిషేధము అన్నారు. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ ఆక్ట్ 1861 కింద శిక్షార్హులు అవుతారని ఎస్పి పేర్కొన్నారు.

# రైతన్నల ఆవేదన పట్టదా..



భూత్పూర్ చౌరస్తాలో రైతుల రాస్తారోకోతో స్తంభించిన ట్రాఫిక్

- యూరియా పంపిణీలో సర్కారు విఫలం
- మళ్లీ పాత రోజులు తెచ్చారు: మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి
- మహబూబ్‌నగర్‌లో యూరియా కోసం రైతుల ధర్నా, రాస్తారోకో
- పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా రైతుల ఆందోళనలతో హోరెత్తింది. యూరియా కష్టాలతో పొలాల్లో ఉండాల్సిన రైతులు రోడ్డెక్కారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతులు రాస్తారోకో చేశారు. యూరియా పంపిణీలో ప్రభుత్వ వైఫల్యం తో విసుగు చెందిన రైతులు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రైతుల ధర్నాకు మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అన్ని మండలాల్లో యూరియా కోసం ధర్నాలు జరుగుతున్నాయని, రైతులు తెల్లవారుజాము నుండే యూరియా కోసం ఎదురుచూస్తున్నారని క్యూలైన్లో చెప్పులు పెట్టి ఆధార్ కార్డులు పెట్టి మళ్ళీ పాత రోజులను గుర్తు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రైతుల ధర్నాలు, ఇబ్బందులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు? వ్యవసాయ శాఖ మంత్రి యూరియా కొరత లేదు..ప్రతిపక్షం డ్రామా అని మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ చేతగాని తనాన్ని ప్రతిపక్ష పార్టీ మీద రుద్దుతున్నారని, ఇంత దౌర్భాగ్యంగా ప్రభుత్వాన్ని నడపటం దురదృష్టకరమన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఈ పరిస్థితి ఉండేదని రైతులు చెప్తున్నారనీ, మళ్ళీ ఇప్పుడు రోడ్ల మీదకు వచ్చామని రైతులు అంటున్నారని పేర్కొన్నారు. సీఎం సొంత జిల్లాలో రైతులకు ఇబ్బంది ఉండదు అనుకున్నాం. కానీ ఇక్కడ యూరియా సమస్య చాలా ఎక్కువ ఉందన్నారు. రైతులు పని వదిలి పెట్టుకొని కేంద్రాల వద్దకు వస్తున్నారు. బిఆర్ఎస్ హయాంలో ఆటో అతనికి చెప్తే ఇంటి దగ్గర వేసి పోతుండే , మేము వ్యవసాయ పనులు చేసుకునే వాళ్లమని రైతులు చెప్తున్నారు. ఇవన్నీ ప్రత్యక్షంగా చూసుకుంటూ ప్రతిపక్షం కుట్ర అని మంత్రులు చెప్తున్నారు. పరిపాలన మీకు చేతనైతే యూరియా తెప్పించి రైతుల ఇబ్బందులు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత పది ఏళ్లలో బిఆర్ఐ హాయంలో రైతన్నలు రోడ్డుమీదికి వచ్చిన దాఖలాలు లేవన్నారు. రైతులకు యూరియా ఇబ్బందులు ఎలాంటి కష్టాలు కలుగనివ్వలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఆందోళనకు మద్దతుగా మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

### వినాయక నిమజ్జనంలో

# అపశృతి

- అతివేగంతో ట్రాక్టర్‌ను ఢీకొన్న డీసీఎం
- ఇద్దరు మృతి, ఏడుగురికి గాయాలు

**ఇటిక్యాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ప్రతిష్టించిన గణనాథుని నిమజ్జనం చేసేందుకు వెళుతుండగా మార్గమధ్యంలో గణనాథుని ట్రాక్టర్‌ను డీసీఎం వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇటిక్యాల ఎస్సై కే రవి కథనం మేరకు.. మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద గణనాథుని ప్రతిష్టించగా 5రోజుల పాటు భక్తులనుండి పూజలు అందుకున్న గణనాథుని 12 కిలోమీటర్ల దూరం ఉన్న బీచుపల్లి కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో గ్రామం నుండి బయలుదేరగా అర్ధరాత్రి సమయంలో 44వ నెంబర్ జాతీయ రహదారి కొట్టం ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలోని స్మశాన వాటిక వద్ద వెనుక నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం –మిగతా4లో..



జమ్మన్న ( ఫైల్ )



నర్సింహుడు (ఫైల్)

# బీసీల గొంతు నొక్కిన బిఆర్ఎస్

- బీసీల రిజర్వేషన్ బిల్లు చారిత్రాత్మకం
- యూరియా కొరతపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం
- డీసీసీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 1 ప్రభాత వార్త:** బిఆర్ఎస్ హయాంలో బీసీల గొంతు నొక్కే ప్రయత్నాలు చేశారని,50% రిజర్వేషన్లు దాటొద్దని కటాఫ్ విధించారని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దాని ప్రకారం అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పాస్ చేయించడం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంపై సీఎం రేవంత్ రెడ్డి,మంత్రివర్గానికి,టీపీసీసీ అధ్యక్షులుకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.ఈనెల 3న మూసాపేట మండలానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలిపారు. వేముల –మిగతా4లో..



సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే జిఎంఆర్, కాంగ్రెస్ శ్రేణులు



లారీని ఢీకొట్టిన ట్రావెల్ బస్సు దృశ్యం

# ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని ఢీకొట్టిన ట్రావెల్ బస్సు స్పాట్‌లోని నలుగురు దుర్మరణం**

**అడ్డాకుల,సెప్టెంబరు1 ప్రభాతవార్త:** అడ్డాకుల సమీపంలోని నేషనల్ హైవే 44పై ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ముందుగా వెళుతున్న లారీని ఢీకొట్టడంతో నలుగురు దుర్మరణం పాలయ్యారు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుండి పొద్దుటూరుకు ప్రయాణికులతో తీసుకు వెళుతున్న సివిఆర్ ట్రావెల్ బస్సు అడ్డాకుల సమీపంలో ముందుగా వెళుతున్న లారీని వేగంగా ఢీ కొట్టింది. ఈఘటనలో బస్సుక్లీనర్ హసన్ (35) అస్రాఫ్ (70) పొద్దుటూరు కమలాపురంకు చెందిన ఎల్లమ్మ(40) నంద్యాలకు చెందిన సుబ్బారాయుడు (58) నలుగురు మృతి చెందారు.మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.ఈప్రమాదంతో జాతీయ రహదారి ట్రాఫిక్‌తో స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న –మిగతా4లో..

### చనిపోయాడనుకున్న వ్యక్తి

# లేచి కూర్చున్నాడు..

**- దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేసిన కుటుంబ సభ్యులు - వనపర్తిలో ఘటన**

**వనపర్తి,సెప్టెంబరు1 ప్రభాతవార్త:** చని పోయాడు అనుకున్న వ్యక్తిలేచి కూర్చున్న సంఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో ఆది వారం చోటు చేసుకుంది. వనపర్తికి చెందిన తైలం రమేష్ తెలంగాణ ఉద్యమకారుడు. ఉద్యమంలో మాజీమంత్రి నిరంజన్ రెడ్డితో కలిసి పనిచేశాడు.ఈక్రమంలో మాజీమంత్రి నిరంజన్‌రెడ్డికి రమేష్ వీరాభిమానిగా మారాడు. నిరంజన్ రెడ్డిపై ఉన్న అభిమానానికి గుర్తుగా తనఛాతిపై సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఫోటో పేరును పచ్చబొట్టుగా పొడిపించుకున్నాడు. హైదరాబాద్‌లో ఉండే తైలం రమేష్ వనపర్తికి వచ్చి ఆదివారం ఉదయం అస్వస్థతకు గురయ్యాడు. ఉలుకు –మిగతా4లో..



తైలం రమేష్ (ఫైల్)



ఫిర్యాదును స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

### ప్రతి దరఖాస్తుకు

# సమాధానం ఇవ్వాలి

**కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం, ప్రజావాణికి 71 దరఖాస్తులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు నుంచి స్వీకరించిదరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 71 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ప్రజల సమస్యలను –మిగతా4లో..

# జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్

- గురుకులాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి...
- స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సంసిద్ధంగా ఉండాలి...
- జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల దృష్ట్యా, ప్రతి అధికారి వారానికి కనీసం ఒక్కసారి ఆయా గురుకులాలను సందర్శించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. విద్యార్థుల అవసరాలను నేరుగా తెలుసుకొని అవసరమైన వనరులు, సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం జిల్లాలోని వివిధశాఖల అధికారులతో కలిసి జిల్లా అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి జిల్లా అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల పురోగతి, అమలులో ఉన్న అడ్డంకులు, ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా చర్చించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి, లక్ష్యాలను నిర్దిష్టంగా చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పారదర్శకత, వేగవంతమైన అమలు మీద దృష్టి పెట్టాలని సూచించారు.ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోనీ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు విధానాన్ని విధిగా పాటించాలని, ఈ నెల నుంచి బయోమెట్రిక్ హాజరు ద్వారానే కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది జీతాలను విడుదల చేయనున్నట్లు, ఆ విధమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సమయపాలన పాటించని అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని, తాను ఆకస్మికంగా కార్యాలయాన్ని సందర్శించేటప్పుడు సిబ్బంది అందుబాటులో లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు. ప్రతి శాఖకు సంబంధించిన పురోగతి, ప్రగతి వివరాలను తనకు పంపించాలని తెలిపారు. వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం పెంచేందుకు, శాఖల పనితీరును సమీక్షించడంతో పాటు సమావేశాలను నిర్వహిస్తూన్నట్లు ఆయన పేర్కొన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని, లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. వివిధ శాఖల నుండి కలెక్టర్ అనుమతికై వచ్చే ప్రతి ఫైల్‌ను ఈ ఆఫీస్ ద్వారానే తనకు పంపించాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు వారికి కేటాయించిన గురుకులాలను తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. గురుకులాల్లో బోధనాపద్ధతులు, వసతి, ఆహారం, ఆరోగ్య అంశాలపై సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గురుకులాల సందర్శన సమయంలో అధికారులు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా లేదా అన్న విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలి. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన, రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. భోజన నాణ్యతపై తరచూ సమీక్షలు నిర్వహించి అవసరమైతే వెంటనే మార్పులు చేయాలన్నారు. నాణ్యమైన భోజనం విద్యార్థుల ఆరోగ్యం, అభ్యాసంపై ప్రభావం చూపుతుందన్న విషయాన్ని గుర్తుంచుకొని, అందులో ఎలాంటి అలసత్వం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండలాల ప్రత్యేక అధికారులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కావాల్సిన అన్ని ముందస్తు ఏర్పాట్లు విధిగా చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల్లో అవసరం ఏర్పాట్లు నెలకొల్పేందుకు అధికారులు తమకు కేటాయించిన మండలాలను సందర్శించి ఎంపిడిఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

## దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**వెల్దండ,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని శ్రీ పాండురంగనాయక దేవాలయంలో ప్రతిష్టించిన గణనాథుని వద్ద సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్ యాదవ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంజీవ్‌యాదవ్‌ను శాలువాలతో సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నంభూపతిరెడ్డి,ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చురామకృష్ణ,నాయకులు గోళి సురేందర్ రెడ్డి, రిటైర్డు టీచర్ యెన్నం కృష్ణారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, వై.శ్రీనివాస్‌రెడ్డి,అలీతో పాటు తదితరులు ఉన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

## బీటీఎం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో

## నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

**కృష్ణ,సెప్టెంబరు1 ప్రభాతవార్త:** బీటీఎంయం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తిమ్మయ్య (ముడుమల్) గారి తల్లి బిషంబ్లీ బీరమ్మ రెండో వర్ధంతి సందర్భంగా నారాయణపేట జిల్లాలోనిలోని పలు గ్రామాల్లో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు బీటీఎం సేవ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో భాగంగా బీటీఎం సేవ ఫౌండేషన్ టీం సభ్యులు నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కుట్టుమిషన్లను అందజేశారు.లబ్ధిదారుల వివరాలు చూస్తే బాదలిలక్ష్మి,అమీన్పూర్ ఉట్కూరు, బోయపుండు సంజమ్మ చిన్నపొర్ల గ్రామం ఉట్కూరుమండలం,మహాదేవి అడవిసత్యారం మాగనూరు మండలం,అనితబిజ్వార్ గ్రామం ఉట్కూరు మండలాలకు చెందిన అనాధ,వితంతువులు ఉన్నారు.చింతనపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లా డుతూ బీటీఎం సేవ ఫౌండేషన్ నిరుపేద మహిళలకు వారి జీవన విధానాన్ని మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి సామాజిక సేవకార్యక్రమాలు చేస్తున్న బీటీఎం సేవ ఫౌండేషన్ టీం సభ్యులకు అభినందనలు తెలుపుతూ వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు చూస్తుంటే సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. పలు రాజకీయ నేతలు కూడా బీటీఎం సేవ ఫౌండేషన్‌కు ప్రశంసలు కురిపించారు.



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న దృశ్యం

## యూరియా అందించడంలో కేంద్రం విఫలం

**బిజినేపల్లి,సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి యూరి అందించడంలో విఫలం చెందిందని సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం తక్కువ మోదాలో యూరియా కేటాయించడంతో రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు అనేక ఆంక్షలు పెడుతూ ఇబ్బందులు పాలు చేస్తున్నారని రోజువారీగా సహకార కార్యాలయం ముందు రైతులు బారులు తీరాల్సి వస్తుందని ఆవేదన వెలిబుచ్చారు. యూరియా కొరత చూపించడంతో బ్లాక్ మార్కెట్లో విపరీతంగా ధరలు పెంచి అమ్ముతున్నారని ఇలాంటి పరిస్థితులలో వ్యవసాయం చేయడం కూడా రైతులకు ఇబ్బందిగా మారిందని చెప్పారు. రైతన్నలకు సరిపడా యూరియా తెపించి రైతుల కష్టాలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కొంపల్లి అశోక్, మండల నాయకులు చంద్రశేఖర్, పరశురాం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

## ఘనంగా సంజీవ్ యాదవ్ జన్మదిన వేడుకలు

**వెల్దండ,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ నాయకులు, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్ యాదవ్ జన్మదిన వేడుకలను వెల్దండ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంజీవ్ యాదవ్ చేత కేక్ కట్ చేయించి ఆయనకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, మాజీ ఎంపీపీ జయప్రకాష్, జక్కుల చిన్న జంగయ్యయాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, రషీద్, అలీ, నారాయణనాయక్, శ్రీనివాస్‌యాదవ్, పుల్లయ్య, ఎర్ర శ్రీను, కిష్టాల్, కుమార్, లక్ష్మణ్‌స్వామి, పురుషోత్తంచారి, రాణితో పాటు తదితరులు ఉన్నారు.

## నిమజ్జనానికి తరులుతున్న గణపయ్యలు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** గత నెల 27 భక్తి శ్రద్ధలతో వివిధ కాలనీలలో ప్రతిష్టించిన గణనాథుల వద్ద ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దేవాలయ చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఆర్యవైశ్య మహాసభ సంఘం మండల, పట్టణ అధ్యక్షులు గంధం కిరణ్ ప్రసాద్, వాస శేఖర్ సంఘం సభ్యులు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. మొదటి లడ్డును రూ.25,116లకు కల్మిచర్ల గోపాల్, 2వ లడ్డును రూ.25,116లకు గంధం కిరణ్ ప్రసాద్‌లకు దక్కించుకున్నారు. అదేవిధంగా గణపయ్యకు అలంకరించిన కండువాలను వేలం పాటలో మాచిపెద్ద వజ్రలింగం కుటుంబ సభ్యులు, బాదం రాఘవేందర్‌లు దక్కించుకున్నారు. వేలం పాటలో లడ్డు, కండువాలు దక్కించుకున్న వారిని దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్, సంఘం సభ్యులు ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వినాయక మండపాల వద్ద అన్న ప్రసాదాలు పంపిణీ కార్యక్రమం, భజనలు, కీర్తనలు, దాండియా, కోలటలతో, ఆట పాటలతో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఊరేగింపు నిర్వహించారు.

## ఇందిరా పార్క్ మహా ధర్నాకు

## భారీగా తరలిన పేట పీఆర్టియూ సైన్యం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** ఉద్యోగుల సిపి ఎస్ రద్దు ఓపిఎస్ సాధన కోసం సోమవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన మహా ధర్నా కు నారాయణపేట జిల్లా నుంచి పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఉపాద్యాయులు భారీగా తరలి వెళ్లారు. నారాయణ పేట జిల్లా నుండి 550మంది ఉపాధ్యాయులు బయలు దేరారు. జిల్లాకు నాయకత్వం వహిస్తున్న అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు తిరుపతి, మండలాలకు భాధ్యత వహిస్తున్న అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, గౌరవ అధ్యక్షులు ఒకేఒక్క అజెండా సిపి స్ రద్దు ఓపిఎస్ ముద్దు అన్న నినాదంతో ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి, మద్దూర్ మండల కేంద్రంలో ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ రెడ్డి మక్తల్ మండల కేంద్రంలో గౌరవ అధ్యక్షులు డి.తిరుపతి మహాధర్నా జెండాఊపి 2 బస్సులను, 24 తూఫాన్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 13 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ధన్వాడలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

**ధన్వాడ,సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలో యూరియా కొరత రైతులని వేధిస్తుంది.గత కొన్నిరోజుల నుంచి యూరియా కోసం రైతుల అవస్థలు చెప్పరానివి.. .. ధన్వాడ మండలంలో ప్రతి గ్రామానికి యూరియా కొరత పట్టిపీడిస్తున్న సర్కార్ నుంచి స్పందన కనిపించడం లేదని రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ధన్వాడ సింగల్ విండో కార్యాలయంలో యూరియా కోసం రైతులు ఉదయం 6 గంటలకే కార్యాలయంకు చేరుకున్నారు గంటల తరబడిగా యూరి యాకోసం పడిగాపులు కాశారు.రైతులు చె ప్పులను లైన్లో ఉంచారు.. యూరియా టోకెన్ల కోసం గంటలు గంటలుగా ఎదురుచూశారు..సింగల్ విండో కార్యాలయంలో పోలీస్ పహార మధ్య యూరియా పంపిణీ కొనసాగింది.. కాగా కేవలం 300 యూరియా బస్తాలు రాగ రైతులు మాత్రం దాదాపుగా 400 మందికి పైగా రైతులు లైన్లో ఉన్నారు. యూరియా కోసం వచ్చిన రైతులు ప్రభుత్వంపై విమర్శలు చేశారు...లీడర్ల ఇంట్లో అక్రమంగా యూరియాను నిల్వ చేసుకున్నారు అంటూ రైతులు ఆరోపించారు...లైన్లో ఒక్క లీడర్ అయిన ఉన్నడా అంటూ రైతులు ప్రశ్నించారు.. యూరియా కోసం ఇంత తిప్పలు పడుతున్న పాలకులు ఎక్కడున్నారు అంటూ నిలదీశారు. లీడర్ల ఇంట్లో ఉన్నా అక్రమ యూరియాను బయటకు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో యూరియాను అందించాలంటూ డిమాండ్ చేశారు. ఒక్కో రైతుకు రెండు సంచుల యూరియాను మాత్రమే ఇచ్చారు.



యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

# యూరియా కోసం భూత్పూర్‌లో రైతుల రాస్తారోకో

- మద్దతు తెల్పిన మాజీ మంత్రులు

శ్రీనివాస్‌గౌడ్,డాక్టర్ లక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఆల

- రైతులను ఆదుకోని

చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శ

- గంటపాటు స్తంభించిన హైవే





భూత్పూర్‌లో యూరియా కోసం చేపట్టిన రాస్తారోకోలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్,లక్ష్మారెడ్డిలు

**భూత్పూర్,సెప్టెంబర్ 1,ప్రభాతవార్త :** తమకు యూరియా ఇవ్వాలని కోరుతూ వందలాదిమంది రైతులు సోమవారం భూత్పూర్ చౌరస్తాలో ధర్నా,రాస్తారోకో నిర్వహించారు.రాస్తారోకొ వల్ల జాతీయ రహదారి కూడలి రోడ్లకిరువైపుల వందలాది వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి.రైతులు చేపట్టిన ధర్నా,రాస్తారోకోకు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్,డాక్టర్ లక్ష్మారెడ్డిలతో పాటు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు మద్దతు పలుకుతూ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ 18నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు తీరని నష్టాలెదురయ్యాయని,సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ రైతులను ఆదుకోని చేతకాని ప్రభుత్వమని విమర్శించారు.తమ పార్టీ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల పాలనలో ఏనాడూ రైతు లు యూరియా కోసం రోడెక్కలేదని అన్నారు.ముందు చూపుతో మాజీ సీఎం కేసీఆర్ రైతులకు యూరియాను అందుబాటులో ఉంచారని పేర్కొన్నారు.ఖరీఫ్,రబీ సీజన్లలో ముందుగానే ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధిలేదని,రైతుబంధు,బోనస్‌లు పూర్తిస్థాయిలో అందించలేదని విమర్శించారు. రైతుల సమస్యలు తక్షణం తీర్చకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని మాజీ మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి,డాక్టర్ లక్ష్మారెడ్డిలు హెచ్చరించారు.ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించేందుకు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భూత్పూర్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించారు.

**కాంగ్రెసొచ్చింది..కష్టాలొచ్చాయి**

**మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**

కాంగ్రెస్ వచ్చి రైతులకు తీరని నష్టాలు,కష్టాల్ని కొనితెచ్చిందని రైతుల రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు.గత పక్షం రోజులుగా రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు.దేశానికి వెన్నెముక అయిన రైతును కష్టపెట్టడం దేశానికి,రాష్ట్రానికి మంచిదికాదని అన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని మాజీఎమ్మెల్యే ఆల డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు,మున్సిపల్ మాజీచైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకులు మనెమోని సత్యనారాయణ,సత్తూర్ నారాయణగౌడ్,టి మురళిధర్‌గౌడ్.తూము శ్రీనివాస్ రెడ్డి,గడ్డం ప్రేమ్‌కుమార్,గడ్డం రాములు, మొహ్మద్ సాధిక్,మొహ్మద్ ఆహ్మద్,సత్తూర్ అశోక్‌గౌడ్,ఆకుల వెంకటయ్య,రాము రాథోడ్, బీక్యనాయక్, రమేష్‌చందర్,సత్తూర్ సురేష్ గౌడ్,వడ్ల బ్రహ్మయ్య,గడ్డం భీమస్వామి,సత్తూర్ రాకేష్‌గౌడ్,సత్తూర్ తిరుపతయ్యగౌడ్, గొడుగు వెంకటరాజు,పులగుర్ల మల్లేష్,భట్టుపల్లి అంజనేయులు నాయక్,సత్తూర్ కృష్ణయ్య గౌడ్,మాల విఠల్‌దాస్ వెంకటేష్,ఆకులరాములు,ఎండి ఫసియొద్దిన్ పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ సభలు నిషేధం : జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి క్రైమ్,సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా వనపర్తి జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" 1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. 30 పోలీస్ ఆక్ట్ ఈ నెల 01.09.2025 నుండి 30.09.2025 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు,.ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాల ను,రాజకీయ నాయకుల,కుల మతాల మ ధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతా యని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పని సరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని ఎస్పీ కోరారు.



ఎస్పి రావుల గిరిధర్ (ఫైల్)

## 10 ఏళ్లపాటు కేసీఆర్ అధికారంలో ఉన్నా బిసిలకు న్యాయం జరగలేదు

**నారాయణపేట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** న్తారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షుడు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీలో 42% బిసి రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా సోమవారం నారాయణపేట జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వేణుగౌడ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీలు పృథ్వీచౌదరి, రామారావు, జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయం చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా ఓబీసీ చైర్మన్ గొల్ల కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడుతూ 10 ఏళ్లపాటు కేసీఆర్ అధికారంలో ఉన్నా బిసిలకు న్యాయం జరగలేదు. కానీ కేవలం 20 నెలల్లో కాంగ్రెస్ మాట ఇచ్చి కులగణన చేపట్టింది. బిసి కమిషన్ ఏర్పాటు చేసింది ప్రత్యేక కమిషన్ ద్వారా లెక్కలు తేల్చింది. అసెంబ్లీలో 42 రిజర్వేషన్లు పాస్ చేసింది. గవర్నర్ అడ్డంకులు పెట్టినా కోర్టు ఆలస్యాలు చేసిన కాంగ్రెస్ వెనుకడుగు వేయలేదు. ఈ చారిత్రాత్మక నిర్ణయం వెనుక రాహుల్‌గాంధీ ఆశయాలు ఖర్గే మార్గదర్శనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఢసంకల్పం పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మొత్తం మంత్రివర్గం కృషి ఉన్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటే నమ్మకం కాంగ్రెస్ అంటే హక్కుల కాంగ్రెస్ అంటే బిసిల భవిష్యత్తు అంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, యువజన కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ ఎస్సీ,బిసి, ఎస్టీ సెల్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## బీసీ సంక్షేమ శాఖలో 41 సంవత్సరాలు

## సుదీర్ఘంగా సేవలందించిన ఖాజా నజీమ్ అలీ అఫ్సర్

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** బీసీ సంక్షేమ శాఖలో వివిధ హోదాల్లో 41 సంవత్సరాలు సుదీర్ఘంగా సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు వెనుకబడిన సంక్షేమ ప్రజలకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందిన నాగర్‌కర్నూల్ జిల్లా బీసీ సంక్షేమ శాఖఅధికారిగా పదవీవిరమణ పొందుతున్న ఖాజా నాజిమ్ అలీ అప్సర్ నేటితరం సంక్షేమశాఖ అధికారులకు ఆదర్శమని అదనపు కలెక్టర్ దేవ సహాయం అన్నారు. నాగర్‌కర్నూల్‌జిల్లాకేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల అధికారుల ఆధ్వర్యంలో ఖాజా నాజిమ్ అలీ అప్సర్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం పాల్గొని వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బిసి సంక్షేమ శాఖలో 41 సంవత్సరాలు సుదీర్ఘంగా ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత పదోన్నతులు, బదిలీలు, పదవీ విరమణలు సాధారణంగా స్వీకరించాలని, పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని, శేష జీవితంలో కూడా మంచి ఆరోగ్యంతో ఉంటూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్, రామ్‌లాల్, చిన్న ఓబులేష్, బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల అధికారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజిం అలీ అప్సర్‌ను ఘనంగా సన్మానించారు.




పదవి విరమణ పొందుతున్న

ఖాజా నజీమ్ అలీ అఫ్సర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## గణేష్ నిమజ్జనోత్సవంలో డీజేలు నిషేధించాలని వినతి

**ఆత్మకూర్ సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఈ నెల నాలుగవ తేదీన పట్టణంలో ఏర్పాటు చేసేటువంటి 26 వినాయక మండపాలలో ప్రతిష్టించినటువంటి వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవ కార్యక్రమంలో డీజేలు నిషేధించాలంటూ సోమవారం రోజు పెద్దమ్మ తల్లి ఆలయ పునర్ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఎస్సై నరేంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా పెద్దమ్మ తల్లి పునర్నిర్మాణ కమిటీ సభ్యులు బాలకృష్ణ, శ్రీనివాసులు తదితరులు కలిసి ఆత్మకూరు ఎస్సై నరేందర్ ను కలిసి విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ నిమజ్జోత్సవంలో భారతీయ సంస్కృతిక సాంప్రదాయాలను కాపాడేందుకు గాను ఎలాంటి అంగు ఆర్భాటాలు లేకుండా సాంస్కృతిక మరియు నృత్య కళాకారులను ప్రోత్సహిస్తూ ఏర్పాటు చేసినటువంటి నిమజ్జోత్సవానికి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఈ మేరకు పట్టణ ప్రజల నుంచి తమకు సంపూర్ణ సహకారం అందిచేసుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.అంతేకాకుండా పట్టణంలోని గాంధీ చౌరస్తాలో సంస్కృతిక సాంప్రదాయాలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానంతో పాటుగా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పెద్దమ్మ తల్లి ఆలయపు నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో వాలంటీర్లను ఏర్పాటు చేశామని వారు తెలిపారు పట్టణ సమీపంలోని ఆత్మకూర్ పరమేశ్వర స్వామి చెరువులో గణేష్ నిమజ్జోత్సవాలకు భారీ క్రేన్లు ఏర్పాటు చేశామని ఎలాంటి ప్రమాదాన్ని అయినా ఎదుర్కొనేందుకు గాను గత ఈతగా లను సైతం అందుబాటులో ఉంచేందుకు ఏర్పాటు చేసుకున్నట్లుగా వారు తెలిపారు అనంతరం ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ మరియు ఎస్ఐ నరేందర్ పట్టణ ప్రముఖులు తదితరులు కలిసి గణేష్ నిమజ్జనోత్సవం చేసే ఆత్మకూరు పరమేశ్వర స్వామి చెరువు పై ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు.



ఆత్మకూరు ఎస్సై నరేంద్రకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం



చెరువు దగ్గర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దృశ్యం

## బాధితుడికి సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**నవాబుపేట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కాకర్లపాడు గ్రామానికి చెందిన దుయ్యగండ్ల రామచంద్రయ్యకు నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గ్రామ ప్రజా ప్రతినిధుల సమక్షంలో రెండు లక్షల 50 వేలరూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష ్యం అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరు ద్ రెడ్డి అన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యండి మైనోద్దీన్,కట్టవీరాంజనేయులు, నర్సిములు, గోపాల్, దయ్యం గుండ్ల మైబు, భాను పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న దృశ్యం

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ,సెప్టెంబర్1 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన సల్వాది భాస్కర్ ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రూ.5వేలు సమకూర్చి మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ మల్లేష్‌లు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.


## భక్తితో ఉత్సవాలు జరుపుకోవాలి



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా భక్తితో జరుపుకోవాలని పట్టణ గణేష్ ఉత్సవసమితి సభ్యులు సూచించారు. సోమవారం నారాయణపేట పట్టణంలోని గణేష్‌నగర్ మంటపంలో ప్రతిష్టించిన వినాయకుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఎవరికి ఆటంకం లేకుండా జరుపుకోవాలని కోరారు.అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంబించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి కార్యదర్శి మిర్చి వెంకటయ్య, ఆర్ఎస్ఎస్ సంఘ్ చాలక్ డా.మదన్ మోహన్ రెడ్డి, సభ్యులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ,పట్టణ అధ్య క్షుడు పి.వినోద్ కుమార్ , నిర్వాహకులు డి.మల్లేష్, సత్యనారాయణ రెడ్డి, పళ్ల వెంకట్ రాములు, విహెచ్‌పి, భజరంగ్ దళ్ నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో అన్నదానం



బీసీ కాలనీలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ సెప్టెంబర్1,ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని బీసీ కాలనీలో మాజీ వార్డు సభ్యులు గడ్డమీద శ్రీనివాసులు యువసేన ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద సోమవారం రోజు అన్నదానం నిర్వహించారు. గడచిన పది సంవత్సరాలుగా నిరాఘాటంగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీ ప్రజలకు సుఖసంతోషాలతో ఉండాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించడం అనంతరం గడ్డమీద శ్రీనివాస్ యువసేనఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండపంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతేకాకుండా ఈ నెల నాలుగవ తేదీన ఆత్మకూరు పట్టణంలో గణేష్ నిమజ్జోత్సవం జరగనున్న నేపథ్యంలో ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా డీజేలు వద్దు ప్రాణాలు ముద్దు అనే నినాదంతో నిమజ్జనోత్సవం జయప్రదంగా కొనసాగించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

## కాంగ్రెస్‌లో చేరిన లారీ అసోసియేషన్ సభ్యులు

### కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల,సెప్టెంబరు1 ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గంలో అభివృద్ధి పథంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి నాయకత్వం పట్ల ఆకర్షితులైన లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మునవర్ భాష, నాయకులు ఎండిఖదీర్, సయ్యద్ వాజిద్ చారి, జాంగిర్ అన్వర్, ఫయాజ్ మోసిన్, నాజీర్ బషీర్, రెహమాన్‌లతో పాటుమరిన్ని 40మంది సభ్యులు సోమవారం జడ్చర్లలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ"జడ్చర్ల అభివృద్ధి కోసం మన ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజా పోషక కార్యక్రమాలకు అన్ని వర్గాల నుంచి వస్తున్న మద్దతు హర్షణీయం. లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరడం ద్వారా మన బలాన్ని మరింత పెంచినట్టు అయింది. వారితో కలిసి జడ్చర్ల ప్రజల కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తాం" అని పేర్కొన్నారు.

## ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

### నారాయణ పేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

**నారాయణపేట,సెప్టెంబరు1 ప్రభాతవార్త :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 07 ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. జిల్లాలో ప్రజల ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లాఎస్పీ యోగేష్‌గౌతమ్ తెలిపారు. ప్రజలకు తక్షణ న్యాయం అందించి పోలీస్ వ్యవస్థపై నమ్మకం భరోసా పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని భూ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులను రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించాలని ప్రతి ఫిర్యాదుదారికి రసీదు ఎఫ్ఐఆర్ కాపీ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతలపరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## డీజేలకు స్వస్తి పలికి సాంప్రదాయ పద్ధతిలో పండుగలు జరుపుకోవాలి : జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణ పేట, సెప్టెంబరు1 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో డీజే వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రకటించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్యం శాంతి భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. డీజే వలన శబ్ద కాలుష్యం పెరిగి చిన్నపిల్లలు విద్యార్థులు వృద్ధుల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని ఎస్పీ తెలిపారు. అంతేకాదు డీజే సంస్కృతి యువతను తప్పుదారి పట్టిస్తుందని పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా పలుమార్లు మత పెద్దలతో శాంతి సమావేశాలు నిర్వహించి ఈ నిషేధంపై అవగాహన కల్పించినప్పటికీ కొందరు కావాలనే డీజేలను వినియోగించారని చెప్పారు. ఫలితంగా జిల్లాలో ఇప్పటివరకు 8 డీజే సెట్లు సీజ్ చేసినట్లు తెలిపారు కర్ణాటక రాష్ట్రం నుండి డీజేలు రాకుండా ఐదు బోర్డర్ చెక్పోస్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు డీజేలు పెట్టినవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తే సౌండ్ బాక్స్‌లు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేస్తూ డీజేల సంస్కృతికి స్వస్తి పలికి మన సాంప్రదాయ పద్ధతిలో పండుగలు జరుపుకుని కోలాటం బ్యాండ్ డబ్బుల వంటి సాంప్రదాయ వాయిద్యాలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

## బీసీ బిల్లు ఆమోదం చరిత్రాత్మకం

### శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో అసెంబ్లీ రిజర్వేషన్ల కాఫ్ ఎత్తివేస్తూ బీసీలకు 42 స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసినందుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో సోమవారం రోజు బాణసంచా కాల్చి స్వీట్స్ పంచి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవడం జరిగింది. మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి, కులగణన చేసి దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని అన్నారు. బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ నమ్మకం అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే నమ్మకమని పంచాయతీరాజ్ చట్ట సవరణ, బీసీ బిల్లు ఆమోదం సందర్భంగా అది మరోసారి నిరూపితమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ టౌన్ అధ్యక్షుడు కుమ్మరి గోవిందు, కంబాల పూర్ మాజీ ఎంపిటిసి ఎల్ల స్వామి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామచందర్, టౌన్ ఎస్సీ సెల్ శ్రీనివాసులు, బహుజన రమేష్, మండల సోషల్ మీడియా సొప్పరి రమేష్, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు చందు, రవి, రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తారు

### బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు

**వనపర్తి రూరల్, సెప్టెంబరు1 ప్రభాతవార్త:** 2029 ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తారని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాతృమూర్తి పై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మండల అధ్యక్షులు సంద వెంకటేష్ ఆధ్వర్యంలో చివర గుంటుపల్లి గ్రామంలో నిరసన వ్యక్తం చేసి రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీల సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ కేవలం మూడు రాష్ట్రాలకు పరిమితమైందని, రాహుల్ గాంధీ ప్రజాక్షేత్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఎదుర్కొనే దమ్ము ధైర్యం లేక రోజు ఒక కొత్త నాటకంతో నరేంద్ర మోడీనిఅప్రతిష్ట పాలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 2023 పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందంటూ కొత్త నాటకానికి తెర తీసి బీహార్లో పాదయాత్ర చేస్తూ మోడీ మాతృమూర్తి పై అనుచిత వ్యాఖ్యలను బిజెపి తీవ్రంగా ఖండిస్తుందని, జరిగిన పొరపాటును సరిదిద్దుకొని రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 13 ఏళ్లు ముఖ్యమంత్రిగా 11 ఏళ్లు ప్రధానమంత్రిగా ఒక్క అవినీతి మరక లేకుండా నిస్వార్థ ప్రజా సేవ చేస్తున్న నరేంద్ర మోడీనీ అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నం చేస్తే 140 కోట్ల ప్రజలు నమ్మే పరిస్థితి లేదని 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఉన్న మూడు రాష్ట్రాలు ఊడబీకి పార్టీని బంగాళాఖాతంలో కలపడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, మండల అధ్యక్షులు సంద వెంకటేష్, ప్రధాన కార్యదర్శి వాకిటి సుదర్శన్, మాజీ ప్రధాన కార్యదర్శి పోతు శ్రీనివాసులు, మండల నాయకులు వాకిటి నిలేందర్, లక్ష్మీకాంతరెడ్డి, జైపాల్ రెడ్డి, చిన్నయ్య యాదవ్, గుట్టకాడి అంజి, మేడమోని కుమార్, కార్తీక్, అనిల్, శివ, కరుణాకర్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అబ్రహం

**ఇటిక్యాల సెప్టెంబర్1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని 44 నెంబర్ జాతీయ రహదారి కొట్టం ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఇటిక్యాల మండలం కేంద్రానికి చెందిన యువత గణనాధుని బీచుపల్లి కృష్ణా నదిలో నిమజ్జనం చేసేందుకు ట్రాక్టర్ పై తరలిస్తుండగా వెనుక నుంచి డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో జమ్మన్న అక్కడికక్కడే మృతిచెందగా తీవ్ర గాయాలు తగిలిన నరసింహుడును కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు. మరి కొంతమందికి గాయాలు తగలగా సోమవారం విషయం తెలుసుకున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం అబ్రహం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. అలాగే పోస్టుమార్టం గదిలో ప్రమాదంలో మృతి చెందిన నరసింహుడు మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే అబ్రహం పరిశీలించారు. ప్రమాదంలో గాయాలతో హాస్పిటల్లో చేరిన వారికి డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఇటిక్యాల గ్రామ నాయకులు ప్రజలు, వివిధ నాయకులు తదితరులు ఉన్నారు.

# గంజాయి సరఫరాపై ప్రత్యేక నిఘా

- మాదక ద్రవ్యాల సరఫరాపై కళాశాలల పరిసరాల్లో ఉన్న క్యాంటీన్‌లలో తనిఖీలు నిర్వహించాలి
- మాదక ద్రవ్యాలు వినియోగించే వారిపై చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీఎస్పీ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, సెప్టెంబరు1 ప్రభాతవార్త:** జిల్లాలో గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు ఉత్పత్తి చేయడం కానీ వినియోగించడం కానీ జరుగ కుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాస్థాయినార్కోటిక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావే శంలో సంబంధిత శాఖల నుండినివేదిక తీసుకోవడంతో పాటు బాధ్యతలను అప్పగించారు. మాదక ద్రవ్యాల సరఫరాపై పాఠ శాలలు, కళాశాలల పరిసరాల్లో ఉన్న క్యాంటీన్‌లు, పాన్‌షాప్‌లు, వైన్ షాపులలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నిఘా పెట్టాలని ఆబ్కారీ, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కళాశాలల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలను క్రియాశీలకంగా మార్చి ప్రతి నెల మొదటి శుక్రవారం యాంటీ డ్రగ్ సమావేశాలు నిర్వహించి విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు జరిగే విధంగా చూడాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి, జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో 6కేసులు నమోదు అయినట్టు తెలిపారు. ఇందులో వనపర్తి పట్టణంలో 2, గోపాల్ పేట మండల పరిధిలో 2, పెబ్బేరులో 2 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలు వినియోగించే వారిపై, సరఫరా చేసే వారిపై, గంజాయి పండించే వారిపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల శిక్షణ పొందిన పోలీస్ శునకాలు మాదక ద్రవ్యాలను సులువుగా గుర్తిస్తున్నాయని వీటి సహాయంతో అనుమానంఉన్న ప్రతిచోట తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అనుమానం వస్తే కళాశాలల్లోను డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్, లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య, ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలి

### నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నారాయణ పేట, సెప్టెంబరు1 ప్రభాతవార్త :** అధికారులు నిబద్ధతతోవిధులు నిర్వహిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శాఖల వారీగా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ఆమె సూచించారు. సోమవారం కలెక్టోరేట్ సమావేశ మందిరంలో ఆస్పిరేషన్ నర్వ బ్లాక్ పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కీలక పనితీరు సూచికలు మెరుగుపరచడానికి వినూత్న ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల ఆదాయం పెంచే ప్రణాళికలు స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధి కల్పించే ప్రాజెక్టులు నీటి సంరక్షణ పాడి పరిశ్రమల ప్రాజెక్టులు ప్రతిపాదించాలని సూచించారు. ఈ నెల 3న నీతి ఆయోగ్ సీఈవోతో వీడియో కాన్ఫరెన్స్ 5న డీపీఆర్ పంపించాల్సి ఉందని గుర్తు చేశారు. ఇటీవలే నర్వ ఆస్పిరేషన్ బ్లాక్ నీతి ఆయోగ్ అవార్డు అందుకున్న విషయం కూడా ఈ సందర్భంగా కలెక్టర్ ప్రస్తావించారు. అంతకు ముందు అసిస్టెంట్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ఆరోగ్యం పోషకాహారం విద్య వ్యవసాయం సామాజికాభివృద్ధి రంగాలలో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను వివరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో శైలేష్ కుమార్, హౌసింగ్ పీడీ శంకర్, వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, పీఆర్ఈఈ హీర్యా నాయక్, డీఈవో గోవిందరాజులు, మత్స్యశాఖ అధికారి రహమాన్, మిషన్ భగీరథ డీఈ రంగారావు, పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, నర్వ ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల అంకితభావం ఉండాలి

### జోగులాంబ జిల్లా జోన్ 7 డిఐజిఎల్ఎస్ చౌహాన్



డిఐజి ఎల్ఎస్ చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్, సెప్టెంబరు1 ప్రభాతవార్త:** సోమవారం రోజు వార్షిక తనిఖీలలో భాగంగా వనపర్తి జిల్లా పరిధిలోని పెబ్బేరు, చిన్నంబావి, పెద్దమందడి పోలీస్‌స్టేషన్లను జోగులాంబ జోన్ జు॥ డిఐజి ఎల్ ఎస్, చౌహాన్ తనిఖీ చేశారు. డిఐజికి ముందుగా వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డిఐజిఎల్ఎస్ చౌహాన్ పోలీస్‌స్టేషన్లను సందర్శించి స్టేషన్లో రికార్డులను, పరిసరాలను తనిఖీ చేసి పోలీస్‌స్టేషన్ రిసెప్షన్, లాకప్ ,మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, ఏ ప్రాంతాలలో నేరాలు, రోడ్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి, కేసుల నమోదు వివరాలు, నేరస్థుల ప్రస్తుత పరిస్థితులు ఏవిధంగా ఉన్నవి తదితర వివరాలను పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను పెబ్బేరు, చిన్నంబావి,పెద్దమందడి ఎస్సైలను, అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ.. విధుల పట్ల అంకితభావం ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రామాలలో, పట్టణాలలో అనుమానిత వ్యక్తులు ఎప్పుడు కనిపించినా వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. ఆర్థిక నేరాలకు కట్టడి చేయడానికి సీసీ టీవీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలకు చైతన్య పరచాలని పేర్కొన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే ఆయా పోలీ స్టేషన్ల సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించేలా చూడాలని, తరుచూ వాహనాల తనిఖీ, నాకా బంది వంటి స్పెషల్ డ్రైవ్స్ చేపట్టి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని ఆయనఅన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ, వెంకటేశ్వరరావు,వనపర్తి సీఐ,కృష్ణయ్య, కొత్తకోట సీఐ, రాంబాబు పెబ్బేర్ ఎస్సై,యుగంధర్‌రెడ్డి, చిన్నంబావి ఎస్సై,జగన్, పెద్దమందడి ఎస్సై, శివకుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

### నిలిచిపోయిన బ్రిడ్జి పనులను వెంటనే చేపట్టాలని

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

**పెబ్బేరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలో చెలిమిల్ల షేర్ పల్లి మధ్యలో ఉన్న కొల్లాపూర్ మెయిన్ రోడ్డు బ్రిడ్జలు గత ప్రభుత్వం ప్రజల కష్టాలను గుర్తించి వెంకటాపూర్ షేర్ పల్లి బ్రిడ్జిలను రూ.16 కోట్లను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విడుదల చేయించడం జరిగింది. మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మండల అధ్యక్షులు వనం రాములు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పనులు వేగవంతం చేసి సగం పనులు పూర్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ఎక్కడేసిన పనులు అక్కడనే ఉందని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్లు తమ సొంత ఖర్చులతో బ్రిడ్జి పనులు చేపడితే కమీషన్ల కోసం బిల్లులు చేయడం లేదని విమర్శించారు. ఈచాతకానీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం గుంతల్లో తట్టెడుమట్టిని కూడా వేయలేదని మండిపడ్డారు. కమీషన్ల కోసం పనులు ఆపడం ఎంతవరకు కరెక్ట్ అని, ప్రజల సమస్యలు మీకు పట్టవా అని, మీకు ఓట్లు వేసిన పాపానికి ప్రజలను నరకయాతన పడుతున్నారని మండిపడ్డారు. జూపల్లి ఇదే రోడ్డులో మీ ముఖ్యమంత్రి కూడా వచ్చారు కదా?ప్రజల కష్టాలు పట్టవా? మీకు మీ ప్రభుత్వానికి చెప్పండి అంటూ మండిపడ్డారు. కార్యక్రమం నాయకులు దిలీప్‌రెడ్డి, కరుణశ్రీ, కర్రే స్వామి, పెద్దింటి వెంకటేష్, జగన్నాధం నాయుడు, పృథ్వీరాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి ,విశ్వరూపం ,మధు, సోషల్ మీడియ కన్వీనర్ వడ్డెరమేష్ పాల్గొన్నారు.

## మన పాఠశాల.. మన ఆత్మగౌరవం

**మక్తల్‌టౌన్, సెప్టెంబరు1 ప్రభాతవార్త:** జాతీయ స్థాయిలో బిఆర్ఎస్‌యం పిలుపు మేరకు దాని అనుబంధ సంస్థ తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయ సంఘం (తపస్ )ఆధ్వర్యంలో మక్తల్ మండలంలోని ఆయా పాఠశాలల ప్రార్థన సమయంలో మన పాఠశాల మన ఆత్మ గౌరవం ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగింది. తపస్ మక్తల్‌మండల శాఖ అధ్యక్ష, కార్య దర్శులు రవీందర్, రాకేష్, జిల్లా బాధ్యులు నాగార్జున మండలగౌరవఅధ్యక్షులు నర్సి రెడ్డి, మండల బాధ్యులు వెంకట్ రాములు ,ప్రహ్లాద్, ఆంజనేయులు, అనిల్‌రెడ్డి, శివరాజ్, మదన్, రాములు, గోవర్ధన్, జగదీష్, రాజాంజనేయులు, రవీందర్, రామాంజనేయులు, ప్రవర్ధన్, శివకుమార్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు కొరకు ఉద్యోగస్తుల నిరసన

**అలంపూర్ సెప్టెంబర్1 ప్రభాతవార్త :** గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగులు సిపిఎస్ రద్దు కొరకై వివిధ రకాలుగా ధర్నాలు నిరసనలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిపిఎస్ రద్దును చేయాలని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వివిధ రూపాలలో నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు సిపిఎస్ రద్దును చేయక పోవడంతో సోమవారం రోజు ఆయా శాఖల అధికారులు సిపిఎస్ రద్దును చేయాలని మధ్యాహ్న భోజన సమయంలో నిరసనను వ్యక్తం చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కార్యాలయం ఆర్ నందు సిపిఎస్ ఉద్యోగుల భోజన విరామ సమయంలో సిపిఎస్ను కొరకు ఉద్యోగస్తులు నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎవలు నాగార్జున రెడ్డి, సుబ్బారెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పెబ్బేరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలానికి పేదలకు హాస్పిటల్ ఖర్చు నిమిత్తం ఎమ్మెల్యే మెగారెడ్డి చొరువతో పెబ్బేరు పట్టణానికి చెందిన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడము జరిగింది. బజారు బాలరాజు రూ. 60000,పి భాస్కర్ ఆర్ఎంపీ డాక్టర్ రూ.35000, హైమావతి పాత పల్లి రూ.10.000,వనపర్తి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చెక్కులు పంపినీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, రాములు యాదవ్, పాతపల్లి మాజీ సర్పంచ్ రవీందర్, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్, మోతే రాములు, నరసింహా, రణధీర్ రెడ్డి, డైరెక్టర్ రాములు, దాబా సత్యనారాయణరెడ్డి, యువ నాయకుడు శివకుమార్ తిరుపతయ్య మిర్చి వెంకటేష్, కాటమోని వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నప్రసాదం

**కృష్ణ, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** కృష్ణ మండలంలోని గుడేబల్లూరు గ్రామంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా అన్న ప్రసాద వితరణ చేశారు. బోయిని గేరి ఎస్ఎస్ఎల్వీ యూత్ గణేష్ దగ్గర చెవిటోళ్ల మల్లేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, చిన్నలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు1 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో వెంటనే అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను పంపాలని సోమవారం హైద్రాబాద్‌లో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని చాంబర్లో కలిసి విన్నవించారు. జిల్లాలో ప్రత్యేకంగా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉందని దానికి తోడు ఇటీవల జరిగిన పదోన్నతులలో దాదాపు 80 మంది ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలల నుండి ఉన్నత పాఠశాలలకు పదోన్నతి పై వెళ్లడం వల్ల ప్రాథమిక పాఠశాలలో సుమారు 250 మంది ఉపాధ్యాయుల అవసరముందన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి వెంటనే జిల్లా విద్యాశాఖ నుండి వివరాలు తెప్పించుకొని అకాడ మిక్ ఇన్స్ ట్రక్టర్లువచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. వీరితో బాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్, తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నేడు ధర్నా

**నారాయణ పేట టౌన్, సెప్టెంబరు1 ప్రభాతవార్త:** కాళేశ్వరం పైన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసిస్తూ నేడు నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ఉదయం 10:30 నిమిషాలకు ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ, సీనియర్ నాయకులు,ముఖ్య నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, కార్యకర్తలంతా హాజరు కావాలన్నారు.

## కన్నుల పండుగగా మట్టి వినాయకుడు నిమజ్జనం



వేలంలో వినాయకుడి లడ్డు దక్కించుకున్న వ్యక్తి

**మక్తల్ టౌన్, సెప్టెంబరు1 ప్రభాతవార్త: మక్తల్** పట్టణంలో వెలసిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మన ఆది దేవుడు అయిన మన విఘ్నేశ్వరుడు పర్యావరణ కాలుష్యం లేకుండా మట్టి విగ్రహ దాత ఆంద్యాల సావిత్రమ్మ శేషయ్య దంపతులు ఇవ్వడం, ఆర్య వైశ్య యువజన సంఘము ఆధ్వర్యంలో ప్రతిష్టించిన మట్టి వినాయకుడు 5 రోజులు నిత్య పూజలు అందుకొని అందరు సుబిక్షంగా ఉండాలని కోరుతూ...అలాగే నిత్య అల్పాహార దాతలచే 5 రోజులు అల్పాహారం, 5 రోజులు నిత్య పూజ సేవకర్తలు, అందరి సహాయ సహకారాలతో..సాయంత్రం 5వ రోజువేలం పాట నిర్వహించగా ..16116 పెద్ద లడ్డు వడ్వాట్ సుజాత తిరుపతయ్య,10001 చిన్న లడ్డు లంకల్ సుజాత నరేష్,1201 కలశం కొండ అరుణ, లక్ష్మణ్,1211 కండుకల్వాల్ స్రవంతి నరేష్,616 ఆపిల్ పండు ద్రాక్ష సంధ్యారాణి ప్రదీప్,516 వెలిగ పండు కుబేర రైస్ మిల్ శ్వేత రఘు దంపతులు వేలంలో దక్కించుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు కట్టసురేష్ కుమార్ మాట్లాడుతూ భక్తి, భజనలతో వినా యకుడిని రోజు కొలిచిన తర్వాత నిమజ్జనం రోజు భక్తి, భజనలు చేసుకుంటూ మన పురాతన సాంప్రదాయాన్ని అందరు కూడా ఆచరించాలనిఈ సందర్భంగా కోరారు. గణపతి పాటతో దాండియా నృత్యాలు,పురుషులు, మహిళలు భజనలు చేస్తూ,భక్తి పాటలు పాడుతూ మక్తల్ పెద్ద చెరువులో ఆ మట్టి వినాయకుడికి పూజలు చేసి నిమజ్జనం చేశారు, ఈ కార్యక్రమంలో యువజన సంఘము సభ్యులు,ఆర్య వైశ్య మహిళలు,పురుషులు, చిన్నారులు, భక్తులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## భజన కీర్తనలతో ఆధ్యాత్మిక శోభ



భజన పోటీలో పాల్గొని భజన కీర్తనలపిస్తున్న భజన బృందం

**చిన్న చింతకుంట,సెప్టెంబరు1 ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని 8 వార్డులో గల బాలగంగాధర్ తిలక్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం జిల్లాస్థాయి భజన పోటీలను నిర్వహించారు. వినాయక మండపం ముందు ఆయా గ్రామాల నుంచి వచ్చిన భజనపరులు ఆలపించిన భజన కీర్తనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. జిల్లాలోని 23 గ్రామాల నుంచి భజనబృందాలు పాల్గొని భజన కీర్తనలు ఆలపించారు. ఒకరి మించి ఒకరు భజనకీర్తన ఆలాపిస్తూ భక్తిభావాన్ని పెంపొందించారు. వినాయక మండపాల వద్ద ఆధ్యాత్మికతను పెంచేందుకు ఇలాంటి భక్తి భావాన్ని పెంపొందించే కార్యక్రమాలు నేటి యువతకు ఎంతో మార్గదర్శకమని భక్తజనం చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం వినాయక మండపాల వద్ద రికార్డు డ్యాన్సులకు యువత అవకాశం ఇవ్వకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనిహిందూ సంఘాలు కోరుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ బాలగంగాధర్ తిలక్‌యూత్ మంచిఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఎంచుకొని జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించడం మండల ప్రజలు హర్షిస్తున్నారు. ఈ భజన పోటీలో గెలుపొందిన భజన బృందాలకు నగదు బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

## జడ్చర్లలో లడ్డు వేలం సందడి



వేలం పాటలో లడ్డును దక్కించుకున్న అశోక్ రెడ్డి

**జడ్చర్ల, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** గణపతి నవరాత్రి ఉత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా జడ్చర్ల పట్టణం జడ్చర్ల -కల్వకుర్తి రోడ్డులోని వెంకటేశ్వర కాలనీ ఫేస్ 1లో నిర్వహించిన లడ్డు వేలం ఘనంగా జరిగింది. భక్తులు, స్థానిక వ్యాపారులు పోటీగా పాల్గొనగా లడ్డు ధర క్షణాల్లో లక్షల్లోకి చేరింది. చివరికి రూ.3,01,000 (మూడులక్షల ఒకవేయి రూపాయలకు)మిడ్జిల్ మండలం చెన్నయ్య పల్లి గ్రామస్తులు తేనీటి అశోక్‌రెడ్డి (వైన్స్ అశోక్ ) లడ్డు దక్కించుకున్నారు. పద్మావతి కాలనీ ఫేస్1 లో..జడ్చర్ల పద్మావతి కాలనీ ఫేస్ వన్‌లో ఆదివారం రాత్రి జరిగిన వినాయకుడి లడ్డు వేలం పాటలో 151 కేజీల పెద్ద లడ్డుకాంగ్రెస్ నాయకుడు తూడి అనిల్‌కుమార్‌రెడ్డి రూ.2,51,000, 21 కేజీల చిన్న లడ్డు 1,36 వేలకు బాధపల్లి రంజిత్ బాబు కూతురు ప్రణవి పేరు మీద వేలంపాట దక్కించుకున్నారు. అదేవిధంగా హుండీ 48 వేలకు మట్టా వెంకటరెడ్డి, కలశం 31 వేలకు టైగర్ నరసింహ, స్వామి పంచ 9వేలకు జస్వంత్‌గౌడ్, స్వామివారి కండువాఎనిమిది వేలకు నర్సింగ్‌రావు దక్కించుకున్నారు. కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## మామిడి చెట్టు తండా వినాయకుని లడ్డు రూ.40 వేలు



వేలం పాటలో వినాయకుడి లడ్డు దక్కించుకున్న వ్యక్తి

**నవాబుపేట,,సెప్టెంబరు1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటేశ్వర తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిచెట్టు తండాలో వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టించిన వినాయకుని ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనం చేయడం జరిగింది. నాయకులు దేవుల నాయక్ వేలం పాటలో వినాయక లడ్డును రూ.40 వేలకు సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సామ్యనాయక్, తావుర్యనాయక్,పాండునాయక్, సంతోష్ నాయక్, సాయి కుమార్, మోహన్ నాయక్, రాజు నాయక్, హనుమంతు నాయక్, గోపాల్‌నాయక్, పూల్ సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

## నిమర్జనానికి తరలిన గణనాథులు




**దామరగిద్ద, సెప్టెంబరు1 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని కాన్కుర్తి గ్రామంలో ఐదురోజులు పూజలు అందుకున్న వినాయకులకు ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా కానుకుర్తి గ్రామంలో బజరంగ్‌దళ్ యూత్ ఏర్పాటు చేసిన మట్టి విగ్రహం డెకరేషన్ ఆకట్టుకున్నాయి. కొన్ని రోజులుగా పరిహారం పెంపు కోసం భూ నిర్వాసితులు చేస్తున్న నిరసనలకు మద్దతుగా ఈ డెకరేషన్ చేశారు. భూబాధిత కష్టాలు ఈ సందర్భంగా యువకులు డాన్సులు చేస్తూ వినాయక నిమజ్జనం చేశారు.

# కొనసాగుతున్న యూరియా కష్టాలు

## ఖిల్లాలో యూరియా కోసం భవనంపై నుండి దూకడానికి ప్రయత్నించిన రైతు .. అడ్డుకున్న పోలీసులు



యూరియా కోసం వేచి ఉన్న రైతులు

**ఖిల్లాగణపురం సెప్టెంబర్1,ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సోమవారం పీఏసీఎస్ భవనం పై నుండి యూరియా కోసం చెన్నకేశవులు అనే రైతు దూకడానికి ప్రయత్నించడంతో ఎస్ఐ వెంకటేష్ తన సిబ్బందితో రైతును కిందికి తీసుకు వచ్చారు. తను ఐదు ఎకరాలు పొలం కౌలుకు చేశానని యూరియా కోసం గత పది రోజులుగా తిరుగుతున్నానని యూరియా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రెండు లారీల యూరియా రావడంతో వ్యవసాయ అధికారులు రైతులకు టోకెన్లు జారీ చేశారు. సోమవారం ఉదయం నుండి రైతులు వందల సంఖ్యలో పిఏసిఎస్ భవనం ముందు బారులు తీరి నిలబడ్డారు. రైతులుగుంపులు గుంపులుగా రావడంతో ఎస్సై వెంకటేష్ తన సిబ్బంది పుంమాయించి యూరియా బస్తాలను సరఫరా చేయించారు. ఒకవైపు టోకెన్లు ఉన్న రైతులు గంటల కొద్దిక్యూలైన్లో యూరియా కోసంవేచి ఉండడం, మరోవైపు కొత్తగాటోకెన్లు రాయించుకోవడానికి రైతులు ఎగబడటంతో ఘనపురం వెంకటంపల్లి వెళ్లే దారి పూర్తిగా రైతులతో నిండిపోయి ట్రాఫిక్ జామ్ అయింది. మండలానికి ఇప్పటివరకు 30 వేలకు పైగా యూరియా బస్తాలు వచ్చాయని అయినా రైతులు యూరియా కోసం వందల సంఖ్యలో వస్తుండడంతో. టోకెన్లు రాయించుకున్న రైతుల ఆధార్ కార్డులను మండల వ్యవసాయ అధికారి మల్లయ్య ఏఈఓలు పవన్ కళ్యాణ్ బాలరాజుఅక్కడే ఉండి తనిఖీ చేశారు. గతంలో యూరియాతీసుకున్న కొంతమంది రైతులను తిప్పి పంపించారు. ప్రజా ప్రతినిధులు అధికారులు కల్పించుకొని యూరియా కొరత లేకుండా రైతులకు పూర్తి స్థాయిలో అందజేయాలని పలు గ్రామాలకు చెందిన రైతులు వేడుకుంటున్నారు.

**ఆత్మకూర్ సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నకు కనీసం వ్యవసాయానికి అవసరమైన యూరియా సరఫరా చేయడంలో కూడా పాలకులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు స్పష్టంగా కనిపిస్తుంది. గడచిన 15 రోజులుగా ఆత్మకూరు మండలంలో యూరియా కష్టాలు తప్పని రైతులకు సోమవారం సైతం యూరియా కోసం ఆత్మకూరులో వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయం ముందు చెప్పులు లైన్లో పెట్టడమే కాకుండా పలు రైతులు నిరీక్షణ కొనసాగించడం విశేషం. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ ప్రధానఎడమ కాలువ మరియు రామన్పాడు బ్యాలెన్స్ ఇన్ రిజర్వాయర్ ఆయకట్టు పరిధి రైతులు పెద్ద ఎత్తున వరినారులు వేసుకున్న నేపథ్యంలో కనీసం ఒక రైతుకు ఎనిమిది బస్తాల యూరియా చొప్పున అవసరం పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కానీ పాలకులు గానీ కనీసం రైతుకు రెండు బస్తాలు కూడా యూరియా అందించకపోవడం పట్ల పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతవారం పెద్ద ఎత్తున రైతులు ఆత్మకూరు సింగిల్ విండో కార్యాలయానికి చేరుకోగా సోమవారం యూరియా పంపిణీ చేస్తామంటూ టోకెన్లు సరఫరా చేసినప్పటికీ కనీసం రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియానైనా అందిస్తారో ఏమో అని పెద్ద ఎత్తున రైతుల తరలి రావడంతో కేవలం 600బస్తాల యూరియా లారీ మాత్రమే ఆత్మకూరుకు చేరుకోవడంతో అధికారులు సైతం ఏమేరకు మేము సప్లై చేయగలమని నిరుత్సాహానికి గురికావడమే కాకుండా రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా రైతులు మాత్రం తమ కష్టాలు తీరే దారేది అంటూ పలువురు ప్రభుత్వంపై శాపనార్థాలు కురిపించడం విశేషం. ఓవైపు జిల్లా అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూస్తున్నామని అవసరమైన మేరకుయూరియా సరఫరాచేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నారే కానీ ఆచరణలో మాత్రం ఏ మాత్రం యూరియా సరఫరా చేయడం లేదంటూ పలువురు విమర్శల వర్షం గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన మేర యూరియా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఆత్మకూరులో పిఏసిఎస్ కార్యాలయం ఎదుట చెప్పులు లైన్‌లో నిలబెట్టిన దృశ్యం

# కాంగ్రెస్, బీజేపీ, చంద్రబాబు కుమ్మక్కు

- గోదారి జలాలను ఆంధ్రాకు తరలించే ప్లాన్
- కాళేశ్వరం సీబీఐకి అప్పగించడం వెనక కుట్ర
- కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు యత్నం
- మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:** కాళేశ్వరం దర్యాప్తు సీబీఐకి అప్పగించడం వెనక కుట్ర దాగి ఉందని, బిజెపి, కాంగ్రెస్, చంద్రబాబు నాయుడు కుమ్మక్కై తెలంగాణ నీళ్లను తరలించుకు పోవాలని చూస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సి లక్ష్మారెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును పెండింగ్ పెట్టి గోదావరి జలాలు తరలించుకు పోయేందుకు ప్లాన్ చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేస్తూ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ప్రాజెక్టును నిపుణులు రిపేర్ చేయొచ్చు అని చెప్తే కూడా రెండేళ్లుగా పెండింగ్ లో పెట్టారని, మొత్తం కాళేశ్వరం కూలిపోతే బాగుండు అని సీఎం రేవంత్ రెడ్డి అనుకుంటున్నారని లక్ష్మారెడ్డి ఆసక్తికర కామెంట్స్ చేశారు. చంద్రబాబుకి నీళ్ల పంపడానికి కుట్ర పన్నుతున్నారని, తెలంగాణ ప్రజలు అంతా గమనిస్తున్నారని గుర్తు చేశారు. కాళేశ్వరం తెలంగాణను సస్యశ్యామలం చేసిందని, లక్షల ఎకరాలకు సాగునీరు అందించి కరువు లేకుండా చేసిందన్నారు. కుమ్మక్కు రాజకీయాలతో తెలంగాణను ముంచాలనుకుంటున్నారని, తెలంగాణను కాపాడటానికి మరో ఉద్యమం రావాల్సిన అవసరం కనిపిస్తుందని తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు.

## వినాయక నిమజ్జనంలో అపశృతి

మొదటి పేజీ తరువాయి భాగం..
గణనాథుని తీసుకెళ్తున్నా ట్రాక్టర్‌ను డీసీఎం డ్రైవర్ అతివేగం అజాగ్రత్త వల్ల ట్రాక్టర్ ను ఢీకొనడంతో జమ్మన్న(50) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన నరసింహుడు(48)ను అంబులెన్స్‌లో చికిత్స కోసం తరలించగా మృతి చెందాడు. అదే ట్రాక్టర్ లో ఉన్న మరో 7గురు వ్యక్తులు జ్ఞానేశ్వర్ టీ.నరేందర్, సి.మహేందర్, కె రమేష్,బి రాముడు, కే యశ్వంత్, సి మధుకు గాయాలు కాగా అంబులెన్స్‌లో గద్వాల, కర్నూలు ఆసుపత్రులకు తరలించారు.మృతుడు జమ్మన్న భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.. సమాచారం అందుకున్న ఇటిక్యాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులు కలగ కుండా సహాయక చర్యలు చేపట్టారు.

## బీసీల గొంతు నొక్కిన బిఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి భాగం..
శివారులోని ఎస్ జిడి ఫార్మావద్ద కొత్తగా ఏర్పాటు చేసిన రెండో యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయనున్నట్లు వెల్లడించారు. యూరియా కొరతపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. యూరియా కోసం రైతులు ఎవరూ ఆంధ్రాశన చెందవద్దని కోరారు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని, ఎరువుల కొరత లేకుండా చూస్తామని అన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు వేణుగౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్లో రాహుల్ గాంధీ ప్రకటించిన విదంగా రాష్టంలో సీఎం నేతృత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ బీసీల సంక్షేమాన్ని ఆలోచించేది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో టీజీఎంఎస్సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్,ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శిరామారావు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, నాయకులు ఎస్పీ వెంకటేశ్, ఆనంద్ గౌడ్, సీజే బెనహర్,గంజి అంజనేయులు,అరవింద్ రెడ్డి సాయిబాబా, పయాజ్, అజమత్ అలీ పాల్గొన్నారు. పాలమూరులో కాంగ్రెస్‌నాయకుల సంబరాలు బీసీల42శాతం రిజర్వేషన్ బిల్లుఅసెంబ్లీలో పాస్ కావడంపై సోమ వారం జిల్లాకేంద్రంలో డీసీసీ అధ్యక్షులు,దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తునసంబరాలు చేసుకున్నారు.స్థానిక న్యూటౌన్‌లోని మల్లికార్జున్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి,స్వీట్లు తినిపించుకున్నారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, ముడాచైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు ఎస్పీ.వెంకటేశ్, సీజే బెనహర్,సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, అజ్మత్ అలీ, అవేజ్, షబ్బీర్ అహ్మద్, గంజి ఆంజనేయులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్‌గా సంగాల అయ్యపురెడ్డి ఎన్నిక

**గద్వాల టౌన్ సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జోగులాంబ గద్వాల జిల్లా చైర్మెన్‌గా బీజేపీ నాయకులు కాంట్రాక్టర్ సంగాల అయ్యపు రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. పట్టణంలోని సోమవారం నిర్వహించిన రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో చైర్మెన్ స్థానానికి పలువురుపోటీ చేయగా అయ్యపురెడ్డినీసొసైటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలక మండలి సభ్యుల ఎన్నికలు ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు.జోగులాంబ గద్వాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలకమండలి 2025-2028 మూడేళ్ల పదవీకాలానికి గాను జరిగిన ఎన్నికలలో చైర్మెన్ గా అయ్యపు రెడ్డి ఎన్నిక కాగా, ప్రమాణ స్వీకారోత్సవాన్ని మహిళా సమాఖ్య భవనంలో విజయవంతంగా పూర్తి చేయబడిందని వారు తెలిపారు. అదేవిధంగా జి.రమేష్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యునిగా, డిఎండి తాహిర్ వైస్ చైర్మన్‌గా, ధనలక్ష్మి ఖజాంచీగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. జిల్లా కార్యనిర్వాహక సభ్యులుగా కరాటే శ్రీహరి,ఎండీ అప్సర్ పాషా,చాగాపురం లక్ష్మీనారాయణ గౌడ్, బండారి పాల్‌సుధాకర్, వరదారవికుమార్, గంగాధర్ గౌడ్,జయరామయ్య, మోహన్ రావు,అక్బర్ బాషా, నల్లారెడ్డిలు ఎన్నికైనట్లు వారు తెలిపారు.తదనంతరం కొత్తగా ఎన్నికైన పాలకమండలి సభ్యులను ఎన్నికల అధికారి,సొసైటీ సభ్యులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ,తమ పదవీకాలంలో జోగులాంబ గద్వాల జిల్లాకు రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత భవనం,రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో విస్తృత స్థాయిలో పాల్గొని,ప్రజలకు అత్యవసర సమయంలో అండగా నిలబడటమే తమ ప్రధాన లక్ష్యమని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన పలువురు కార్యకర్తలు,స్వచ్ఛంద సేవకులు, గౌరవ సభ్యులు పాల్గొన్నారు.


గెలుపొందిన అయ్యపురెడ్డితో విజయ సంకేతం చూపిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

# సీపీఎస్ అంతమయ్యే దాకా పోరాటం

**-టిజిఈ జేఏసీ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహదినం**



ధర్నా చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల పాలిట శాపంగా సీపీఎస్ విధాన ఉందని, పిఎఫ్ ఆర్డీఏ చట్టం రద్దయ్యే దాకా పోరాటం కొనసాగిస్తామని టీజీఈ జేఏసీ ఐక్యవేదిక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటంలో భాగంగా సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పరిగణించి జిల్లా కలెక్టరేట్ ఎదుట జేఏసీ చైర్మన్ బావండ్ల వెంకటేశ్, సెక్రటరీ జనరల్ పి.రాజశేఖర్ రావుల అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో పలువురు భాగస్వామ్య సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా తక్షణమే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీజీఈ జేఏసీ కో-చైర్మన్ మరియు టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ యం.శ్రీధర్ శర్మ మాట్లాడుతూ కేవలం నెలవారి వేతనాలు, పెన్షన్ పైననే ఆధారపడ్డ ఉద్యోగ,ఉపాధ్యాయ పెన్షనర్లకు సామాజిక భద్రత లేని సిపిఎస్/ఎన్పీఎస్ మరియు యుపిఎస్ స్కీంలను రద్దు చేసి డిఫైన్డ్ పెన్షన్‌గా ఉన్న పాత పెన్షన్ పునరుద్ధరించాలని పెన్షన్ సమస్యలకు కారణమైన పిఎఫ్ఆర్డీఏ చట్టాన్ని కేంద్రం రద్దు చేసేదాకా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కో-చైర్మన్లు ఎస్టీయు అధ్యక్షుడు కె.శ్రీధర్ రావు, డిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి జె.రామస్వామిలు మాట్లాడుతూ నయా ఉదారవాద విధానాలకు అనుగుణంగా దేశంలో మరియు రాష్ట్రంలో ఇటువంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. పోరాటాల ద్వారానే పాతపెన్షన్ సాధించుకుంటామని తెలిపారు. ట్రెస్సా అసోసియేట్ అధ్యక్షుడు ఖాజామొయినొద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు బకాయి పడిన జిపిఎఫ్ మెడికల్ బిల్లులు మరియు సప్లిమెంటరీ వేతనాలను వెంటనే విడుదల చేయాలని,తెలంగాణ రాష్ట్రంలో 2వ పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. టిపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి కూటమి ఎన్డీఎ మరియు కాంగ్రెస్ కూటమియుపిఏ రెండూ కూడా ఈ సంక్షోభానికి కారణమని, కేంద్ర ప్రభు త్వం తక్షణమే పిఎఫ్ఆర్డీఎ చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వం పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ఈయు జిల్లా అధ్యక్షులు బీరం అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులను ఏకం చేసి దశాబ్దం కాలంగా పోరాటాలు చేస్తున్నామని, సిపిఎస్ అంతమయ్యే దాకా పోరాడుతామన్నారు. ధర్నాలో టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు ఆర్.కృష్ణ, డిటిఎఫ్ అధ్యక్షులు గోవర్దన్, ఎస్టీయు ప్రధాన కార్యదర్శి మురళీ, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, ఈశ్వర్,టిజివో కార్యదర్శి సంజీవ్, ఇంజనీర్స్ అసోసియేషన్ ఆంజనేయులు,టిఆర్టీఎఫ్ సతీష్,ఆల్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.లక్ష్మయ్య, పెన్షనర్స్ సంఘం జె.రాంచంద్రారెడ్డి, పంచాయతీసెక్రటరీ అసోసియేషన్ రాజు,సీపీఎస్ఈయూ కార్యదర్శిలక్ష్మినరసింహారావు, సిపిఎస్‌సంఘం నుండి బాలస్వామి, టిఎన్జీవో మహిళా కార్యదర్శి లలిత, టిఎస్‌యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలుఎం.రమాదేవి మరియు వివిధ సంఘాల నాయకులు అధికసంఖ్యలో ఉపాధ్యాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### గత ప్రభుత్వంతో పోలిస్తే

# ప్రస్తుత కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువ యూరియా పంపిణీ

**- కాంగ్రెస్ నాయకులు**



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**మక్తల్ టౌన్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలో యూరియా పంపిణీ పై రైతులను అనవసరంగా గందరగోళానికి గురి చేస్తున్నారని, గత బిఆర్ఎస్ హయాంతో పోలిస్తే ప్రస్తుత కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువ మొత్తంలో యూరియా పంపిణీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ రవికుమార్ తెలిపారు.టిఆర్ఎస్ హయాంలో యూరియా పంపిణీ, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఏరియా పంపిణీ పై గణాంకాలతో సహా మీడియా ముందు విడుదల చేశారు.2021 వ సంవత్సరంలో టిఆర్ఎస్ హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా రైతులకు 12,532 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయగా, 2022వ సంవత్సరంలో టిఆర్ఎస్ సమయంలో రైతులకు 14,638 మెట్రిక్ టన్నుల యూరియాను సప్లై చేశారు. 2023లో 16,324 మెట్రిక్ టన్నుల యూరియా అందించార న్నారు. కాంగ్రెస్ హయాంలో 2024 సంవత్సరంలో రైతులకు 16457 మెట్రిక్ టన్నుల యూరియా అందించగా, తాజాగా 2025 వ సంవత్సరంలో నియోజవర్గం మొత్తం రైతులకు ఇప్పటి వరకే 15,056 వేలమెట్రిక్‌టన్నుల యూరియా ఆగస్టు నెల వరకు అందించామని, సెప్టెంబర్ నెలలో ఇంకా యూరియా అందిస్తామని, యూరియా పంపిణీ కొనసాగుతున్నట్లు తెలిపారు.యూరియా పంపిణీ తో పాటు రైతులకు సంబంధించిన అన్ని విషయాలపై అంబేద్కర్ సాక్షిగా చర్చకు సిద్ధమని కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ హయాంలో దుబ్బాకలో యూరియా కోసం క్యూలో నిలబడి ఉన్న రైతు గుండెపోటుతో మరణిస్తే... అప్పటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చనిపోయినరైతును సినిమా టికెట్ల కోసం క్యూ నిలబడి గుండెపోటుతో మరణించిన వారితో పోల్చారని, ఇంతకంటే దారుణం మరొకటి ఉండదని అన్నారు.మక్తల్ నియోజక వర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి చొరవ తోనే 150పడకల ఆసుపత్రి పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, కావాలంటే వెళ్లి చూసుకోవచ్చని అన్నారు. నియోజవర్గ అభివృద్ధిలో ఎవరు సలహాలు సూచనలు ఇచ్చినా స్వీకరిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారని,అయితే ప్రతి అంశంలోనూఅభివృద్ధికి అడ్డుపడుతూ మంత్రిపై లేనిపోని విమర్శలు చేస్తే చూస్తూ సహించేది లేదని హెచ్చరించారు. యూరియా విషయంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత ఉన్నా... కేవలం మంత్రి గారిని విమర్శిస్తున్నారని, బిజెపి ఎంపీ అయిన మీ అక్క డీకే అరుణని ఎందుకు విమర్శించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి యూరియా అవసరానికి తగినట్లు సప్లై చేయాలని కోరినా కేంద్రం ఆలస్యం చేస్తోందని, అయినా కూడా రైతులకు అవసరానికి తగినతంగా యూరియాఅందుబాటులో ఉంచుతున్నామనిఅన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌డైరెక్టర్లు శ్రీనివాసులు, ఫయాజ్, పారేవుల విష్ణు, నూరుద్దీన్, మందుల నరేందర్ ,కట్ట వెంకటేష్, బోయ వెంకటేష్,ఒబులేష్, కావాలి రాజేందర్, వల్లంపల్లి లక్ష్మణ్, కావలి తాయప్ప, టీవీ9 వెంకటేష్, బోయ నరసింహ, కల్లూరి గోవర్ధన్, వాకిటి భాస్కర్, సాదిక్,మెకానిక్ రాము, పీర్ పాషా, కొత్త గార్లపల్లి అశోక్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# దేశానికి ప్రమాదం పొంచి ఉందని ముందే చెప్పిన సురవరం

**సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి**
**సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలోపాల్గొన్న**
**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్**



సభలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

**అలంపూర్ సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఇవాళ దేశంలో నెలకొన్న పరిస్థితులను చూస్తుంటే నాడు సీపీఐ అగ్ర నేత రాజనీతి పరిజ్ఞానుడు, ఆలోచన విధానం కలిగిన నేత మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి చెప్పిన మాటలు అక్షర సత్యం అయ్యే పరిస్థితులు స్పష్టమవుతున్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు.సోమవారం గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామంలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. కుటుంబ సభ్యులు,సీపీఐ పార్టీరాష్ట్ర నాయకులు బాలనరసింహ అధ్యక్షతన ఈ కార్యక్రమానికి ఏర్పాటు చేశారు.మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో పాటు ఆయన హాజరయ్యారు. ముందుగా వారు సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ...దేశంలో మతోన్మాద నియంతృత్వ ,ఫాసిస్టు పరిపాలన సాగబోతున్నదని ప్రమాదం అంచుల్లో ప్రజాస్వామ్యం దేశం ఉంటుందని జాగ్రత్తపడాలని ఆనాడే ఊహించి గొప్ప వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు.పాఠశాలల అదనపు గదుల ఏర్పాటు, గ్రామంలో అర్హులైన నిరుపేదలకు 5 మంది లబ్ధిదా రులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ప్రొసీడింగ్ కాపీలు, జీవోలు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ సభలో ప్రభుత్వం తరపున అందజేసి చివరి కోరికను తీర్చినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం స్వర్గీయ సురవరం సుధాకర్ రెడ్డి పేరుమీద సముచిత స్థానం కల్పించే దిశగా ముందుకు పోతుందని తెలిపారు .అనంతరం సురవరం సుధాకర్‌రెడ్డి సేవలను ఆయన కొనియాడారు.ప్రజా వ్యతిరేక ధోరణిలను ఖండించాలి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... వర్తమాన సమాజంలో ఈ దేశంలో పెచ్చరిల్లుతున్నటువంటి పెడ ధోరణులు,ప్రజా వ్యతిరేక ధోరణిలను నిర్మొహమాటంగా వ్యతిరేకించాల్సిందేనని ఖండించాలని ఆదిశగా కలిసి వచ్చే అన్నిశక్తుల యొక్క ఐక్యత సంఘటనను ఈ దేశంలో ఏర్పాటు కావాలని అదే సుధాకర్ రెడ్డికి ఘన నివాళులు అర్పించడం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురవరం కుటుంబ సభ్యులు విజయమ్మ,నిఖిల్,కపిల్,సీపీఐ రాష్ట్ర నాయకులు బాల నర్సింలు, పల్లె నరసింహ, జిల్లా నాయకులు ఆంజనేయులు వెంకటస్వామి, ఇటిక్యాల పాడు మాజీ సర్పంచ్ సురవరం లోకేశ్వర్‌రెడ్డి, శేషన్‌గౌడ్, సీపీఐ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయాడనుకున్న వ్యక్తి లేచి కూర్చున్నాడు

మొదటి పేజీ తరువాయి భాగం..
పలుకు లేకుండా పడి ఉండటంతో మరణించాడని కుటుంబ సభ్యు లు భావించారు.ఆదివారం సాయంత్రం అంతిమ సంస్కారాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పడుకోబెట్టి పూలమాలలు వేశారు. దహన సంస్కారాల కోసం డబ్బులు ఇచ్చేశారు. విషయం తెలుసుకున్న నిరంజన్‌రెడ్డి తైలంరమేష్‌ను కడచూపు చూసేందుకు ఇంటికి వెళ్లాడు. పూలమాల వేసేందుకు సిద్ధమైన నిరంజన్‌రెడ్డికి రమేశ్ శరీరంలో కదలిక ఉన్నట్లు గుర్తించి, రమేష్... రమేష్... అంటూగట్టిగాపిలవటంతోమరింతగాకదిలాడు.ఆస్పత్రికి తరలించగా రమేష్‌బతికి ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈఘటనతో ఒక్కసారిగాఅంతా ఆశ్చర్యానికి గురయ్యారు.ఈ వార్తఆనోట ఈనోట బయటకు రావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## ప్రతి దరఖాస్తుకు సమాధానం ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి భాగం..
పరిష్కరించడం కోసంఇచ్చిన ప్రతి దరఖాస్తును నిరక్ష్యం నిరక్ష్యం చేయకుండా సంబంధిత శాఖాధికారులు జాగ్రత్తగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తుకు సమాధానం ఇవ్వడం, అవసరమైన సమాచారం ప్రజలకు అందించడం, సమస్య పరిష్కారం దిశగా స్పష్టమైన రిపోర్టులు సమర్పించడం ప్రతి అధికారి యొక్క బాధ్యత అని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జడ్పీ సీఈఓ వెంకట రెడ్డి, ఆర్డీఓ నర్సింహులు, ఆర్డిఓ నవీన్, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గణపతి లడ్డు వేలం రూ.1,52,500


వేలం పాటలో లడ్డును దక్కించుకున్న శాగ గోపాల్

**జడ్చర్ల, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** గణపతి నవరాత్రి ఉత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం జడ్చర్ల పట్టణంలోని వివేకానంద కాలనీలో నిర్వహించిన లడ్డు వేలం ఘనంగా జరిగింది. భక్తులు, స్థానికులు పోటీలో పాల్గొనగా లడ్డు ధర క్షణాల్లో లక్షల్లోకి చేరింది. చివరికి రూ.1లక్ష 52వేల 500లకు శాగ జనార్దన్ జ్ఞాపకార్థం శాగ గోపాల్ వేలంలో లడ్డును దక్కించుకున్నాడు. కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వర్చువల్‌గా హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవం

**నవాబుపేట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** పార్లమెంట్ సభ్యురాలు డికె అరుణ క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్‌గా హై మాస్ లైట్లను నవాబ్ పేట్ మండలం కొండాపూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ నిధులనుండి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కూడా వర్చువల్‌గా ప్రారంభించారు.కొండాపూర్ గ్రామంలో ఎంపీ నిధుల నుండి ఏర్పాటు చేసిన హై మాస్ లైట్లను మహిళలు గ్రామ పెద్దలు యువకులు వివిధ పార్టీల నాయకులు పాల్గొని లైట్లు ఆన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మండలం కార్యదర్శి రాఘవేంద్రచారి,బూత్ అధ్యక్షులు రమేష్, ఆంజనేయులు బాలరాజ్, శ్రీకాంత్,దామోదర్, శాంతయ్య, పోకల కృష్ణయ్య, రాములు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ఆర్థిక చేయూత

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని నగరాల 3 సెంటర్లో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం రూ.25వేలను మస్కాని బాలస్వామి ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా తనసొంత డబ్బుతో పోచమ్మ గుడి, సాగర్ యూత్ సభ్యులకు,యాదవయూత్ సభ్యులువినాయక మండపాలు ఏర్పాటుచేయడం జరిగింది."మన గ్రామం మనఅభివృద్ధి" అన్నట్టుగా తన గ్రామ అభివృద్ధి కోసం ఎన్నో మంచి కార్యక్రమా లు చేస్తున్నటువంటి బాలస్వామిని శ్రీరంగాపూర్ ఎస్సై రామ కృష్ణ, ఏఎస్ఐనరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నిర్మల రాధాకృష్ణ, కాంగ్రెస్ యువ నాయకులు, నాగరాల గ్రామం ప్రజలు పెద్దలు మహిళలు అందరూ శాలువతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా

**జడ్చర్ల, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణము పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీబీఐ ఎంక్వైరీ కమిటీ ఏర్పాటు ప్రకటించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు పార్టీ శ్రేణులు ప్రకటించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశం మేరకు ఉదయం 10గంటలకు జడ్చర్ల తాసిల్దార్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ మంత్రి సి లక్ష్మారెడ్డి ధర్నాలో పాల్గొంటారని, మాజీ ప్రజాప్రతినిధులు. ఎంపీపీలు.జడ్పీటీసీ.ఎంపీటీసీలు. సర్పంచ్ లు.మూధ డైరెక్టర్స్ ఉపసర్పంచులు,రైతు బంధు అధ్యక్షులు, పార్టీ మండల, గ్రామ అధ్యక్షులు,అనుబంధ సంఘాల నాయకులు పార్టీనాయకులు పాల్గొని విజయ వంతం చేయాలని పేర్కొనారు.

## వ్యవసాయ పనిముట్ల పంపిణీ

**గద్వాల టౌన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ-2025 కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చిన్న,సన్నకారు రైతులకు 50శాతం రాయితీతో వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ సక్రియ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు రూ.2.24 కోట్ల నిధులను కేటాయించి మొత్తం 2703 యూనిట్ల పనిముట్లనురైతులకు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ పథకానికి ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులు,చిన్న మరియు సన్నకారు రైతులు అర్హులని తెలిపారు.ఆసక్తి గల రైతులు తమ ఆధార్ కార్డు,పట్టాదారు పాస్‌బుక్,ట్రాక్టర్ ఆర్ సి జిరాక్స్ పత్రాలను దరఖాస్తుతో జతచేసి సమర్పించవలసి ఉంటుందని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను మండల కమిటీ పరిశీలించి, తహసిల్దారు, ఎంపిడిఒ, వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో అర్హులైన రైతులను ఎంపిక చేసి,పనిముట్లనుమంజూరు చేయబడుతుందని తెలిపారు. జిల్లాకు కేటాయించినపనిముట్లలో1968 బ్యాటరీ స్ప్రేయర్లు,396 పవర్ స్ప్రేయర్లు, 9 బండ్ ఫార్మర్లు,131 కల్టివేటర్లు కేజీ వీల్ సహా, 103 రొటవేటర్లు, 18 సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్లులు, 25 బ్రష్ కట్టర్లు, 17 పవర్ టిల్లర్లు, 17 పవర్ వీడర్లు , 19 స్ట్రా బేలర్లు ఉన్నట్లు తెలిపారు.రైతులు మరిన్ని వివరాల కోసం తమ తమమండల వ్యవసాయ అధికారులను లేదా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించవలసిందిగా కోరారు.

## మహాధర్నాకు బయలుదేరిన ఉపాధ్యాయులు

**నర్వ, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** సీపీఎస్ అంతమే లక్ష్యంగా పీఆర్‌టీయూ సంఘం పని చేస్తుందని నర్వ మండల అధ్యక్షుడు యస్.వెంకటేష్ పేర్కొన్నారు.సంఘం ఆధ్వర్యంలో నేడు సెప్టెంబర్1న హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నాకు సోమవారం నర్వ మండల పిఆర్‌టియూ సంఘం ఉపాధ్యాయులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. పిఆర్టియు ప్రధాన కార్యదర్శి జి.హరీష్, రాఘవరెడ్డి, మల్లేష్, వేణుగోపాల్, అఖీల్ పాష,సూర్య ప్రకాష్, రఘువర్మ, అనిల్ కుమార్ ఉన్నారు.

**పెబ్బేరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణం నుండి బయలుదేరారు పెబ్బేరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.చిన్న రాములు, బి.దుర్గాప్రసాద్ యాదవ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కే చంద్రశేఖర్ రెడ్డి,మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్,అశోకవర్ధన్‌రెడ్డి, రాష్ట్రకార్యదర్శి బిదయానంద్, శ్రీరంగాపురం మండలప్రధాన కార్యదర్శివిష్ణువర్ధన్ నాయుడు, చిన్నంబాయిమండల అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు వెంకటయ్య ఉన్నారు.